బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల/పాలకుర్తి, మార్చి 27: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు తోటకూరి రాంచందర్ తల్లి తోటకూరి బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నడిదే రాజనర్సింహారెడ్డి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు పల్లా భార్గవి సుందర్‌రామిరెడ్డి, తీగల దయాకర్, ఆనంతోజు కృష్ణమూర్తి, ఎల సుందర్, తోటకూరి కిష్టయ్య, గండిపెల్లి యాకయ్య ఉన్నారు. పాలకుర్తి మండలం బమ్మెరకు చెందిన బెల్లంకొండ సోమయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మండల కేంద్రంలోని ముద్రబోయిన పూల ఉమ గృహ ప్రవేశానికి హాజరయ్యారు. తాజా మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, రంగినేని సత్యనారాయణరావు, దార శంకరయ్య, బత్తిని గోపాల్, దేవయ్య, ఎన్నకూస యాకయ్య, కమ్మగాని నాగన్న, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, జర్పుల బాలునాయక్ పాల్గొన్నారు.

ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

ఎర్రబెల్లి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న జిట్టె కొమురయ్య

దేవరుప్పుల: కడవెండి గ్రామానికి చెందిన జిట్టె కొమురయ్య కాంగ్రెస్ పార్టీ వీడి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి గురువారం ఎర్రబెల్లి రాగా స్వయంగా వచ్చి తాను తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరుతానని చెప్పడంతో గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ తాను ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు విని మోసపోయానని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. కొత్త పథకాల అమలు దేవుడెరుగు, కేసీఆర్ అమలు చేసిన రైతు ప్రయోజన పథకాలను ఇవ్వడం లేదన్నారు. ఈ యాసంగిలో సాగునీరు కొరతతో రైతులు అల్లాడిపోతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు తాటిపల్లి మహేశ్, రఫేల్‌రెడ్డి ఉన్నారు. కాగా, కడవెండిలో ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం జలకడవ బోనమెత్తారు.

సోలార్ ప్రాజెక్టుతో పచ్చని భవిష్యత్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- ఓబుల్ కేశవాపూర్‌లో మైక్రో - గ్రిడ్ సోలార్ ప్రాజెక్టు

ఓబుల్ కేశవాపూర్‌లో సోలార్ ప్యానల్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ రూరల్, మార్చి 27: మైక్రో - గ్రిడ్ సోలార్ ప్రాజెక్టు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంతోపాటు పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంతో పచ్చని భవిష్యత్‌కు దోహదపడుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం మండలంలోని ఓబుల్ కేశవాపూర్‌లో 140 కిలోవాట్స్ మైక్రో - గ్రిడ్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూత్ ఆఫ్ ఇండియా ఎన్జీవోస్ సంస్థ సహకారంతో సేల్స్ ఫోర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ చేయూతతో రూ.కోటి 60లక్షలతో ఈగ్రామంలో 100 ఇళ్లకు సోలార్ ప్యానెల్స్, వీధి దీపాలు, పాఠశాలలో పది సోలార్ ప్యానెల్స్ అమర్చినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌లో ఈ ప్రాజెక్టు ప్రారంభించారని, ఇది రెండోది ఈ గ్రామంలో నెలకొల్పారని తెలిపారు. మరిన్ని గ్రామాలను దత్తత తీసుకొని, సోలార్ ప్రాజెక్టు చేపట్టాలని కోరారు. పీఎం సూర్యఘర్ పథకం కింద గృహాలకు కనెక్షన్ తీసుకోవచ్చని, బ్యాంకు రుణ సదుపాయం ఉందని, రాయితీ కూడా లభిస్తుందని వివరించారు. గ్రామాల్లో, పాఠశాలలు, రైతుల వ్యవసాయ బావుల వద్ద కూడా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చని, అందుకోసం పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు రూపొందించిన సౌరశక్తి నమూనాను కలెక్టర్ వీక్షించి అభినందించారు. డీఈవో రమేశ్, సేల్స్ ఫోర్స్ డైరెక్టర్ సంకేత్, సభ్యుడు కిరణ్, యూత్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు శైలేష్, సభ్యులు సాయి, రాజు, హెచ్ఎం వీరాంజనీ, బీఆర్ఎస్ యువజన నాయకుడు కొమ్ము రాజు, రమేశ్ పాల్గొన్నారు.

చిన్నపెండ్యాలలో చలివేంద్రం ప్రారంభం

చిల్పూరు, మార్చి 27 : మండలంలోని చిన్నపెండ్యాలలో చలివేంద్రాన్ని పంచాయతీ సెక్రటరీ శశికుమార్ గురువారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్ బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు గాంటే ఉపేందర్ యాదవ్, వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు శాగ వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి నాగరాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు తాళ్లపల్లి గంగరాజు, తాళ్లపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

కడియం.. కాంగ్రెస్సా, బీఆర్ఎస్సా?

- ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి
- అసెంబ్లీలో మాట్లాడుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా న్యూస్ చానళ్లలో ప్రచారం
- ఉప ఎన్నికల భయంతోనే శంకుస్థాపనలు
- మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 27: కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ కండువా కప్పుకున్న కడియం శ్రీహరి ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని తన నివాసంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ అధ్యక్షతన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు నేటికీ బీఆర్ఎస్ అని చెప్పుకుంటున్నారని, అందుకే అసెంబ్లీ సమావేశాల్లో కడియం మాట్లాడుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని న్యూస్ చానళ్లలో వస్తోందని తెలిపారు. ఉప ఎన్నికలు వస్తాయనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపలు చేస్తోందని, ఉప ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే రూ.కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించగా భయపడి కడియం తన పరిధి కాకున్నా, ప్రొటోకాల్ పాటించకుండా ఈనెల 18న దేవన్నపేటలో మంత్రులను తీసుకువచ్చి దేవాదుల మూడో దశ నీటి విడుదల చేపట్టగా మోటర్లు మొరాయించాయని తెలిపారు. దేవాదుల ప్రాజెక్ట్ పనుల్లో కడియం శ్రీహరికి ఎలాంటి పాత్ర లేదని, ప్రాజెక్ట్ తొలి రెండు దశల అభివృద్ధికి కూడా కడియం సహకరించలేదని విమర్శించారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే దేవన్నపేట పంప్‌హౌజ్‌ను తాను పలుమార్లు పరిశీలించి, వెంటనే సాగునీరు అందించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. దేవన్నపేట పనులను ఒక్కసారి కూడా పరిశీలించని కడియం రాజకీయ లబ్ధి కోసం అధికారులు నీటిని విడుదల చేసినప్పటికీ బుధవారం రెండోసారి హెలికాప్టర్‌లో మంత్రితో మరోసారి దేవన్నపేటకు వచ్చారని, దీని ద్వారా ప్రజల సొమ్ము వృథా చేయడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.

రాజ్యాంగంపై నమ్మకం ఉంది

రాజ్యాంగంపై, సుప్రీం కోర్టుపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. గతంలో 2/3 వంతు ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా చట్టపరంగా బీఆర్ఎస్‌లో చేరారని, కానీ కారు గుర్తుపై గెలిచి, కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలు ఆ పార్టీ ఎమ్మెల్యేలమని చెప్పుకునే ధైర్యం లేదన్నారు. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే సుప్రీంకోర్టు వారిపై తీసుకుంటుందని తమకు నమ్మకం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, కనకం గణేశ్ పాల్గొన్నారు.



సిద్దెంకిలో ఎండిపోయిన పంట పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాల్వలున్నా ఎండిన పంటలు

- సకాలంలో గోదావరి నీటిని విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- సిద్దెంకిలో ఎండిన పంటలు పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

జనగామ రూరల్, మార్చి 27: గోదావరి కాల్వలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పంటలు ఎండిపోయాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని సిద్దెంకిలో నీళ్లులేక ఎండిపోయిన పంటలను రైతులతోపాటు జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, మండల రైతుబంధు మాజీ కోఆర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్ రెడ్డితో కలిసి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో గోదావరి కాల్వల ద్వారా ఇక్కడి చెరువులు, కుంటలకు నీరు రావడంతో పంటలు దండిగా పండాయని తెలిపారు. నేడు పంటలు ఎండిపోయి కనిపిస్తున్నాయని తెలిపారు. గోదావరి కాల్వలు ఉన్నప్పటికీ ప్రభుత్వం సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని, గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే పొలాలు ఎండిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకొని సాగునీరు అందించాలన్నారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి అప్పులే మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ మడిపల్లి సుధాకర్ గౌడ్, నాయకులు, రైతులు పుప్పాల మల్లయ్య, బీదని సిద్దులు, రాగుల నర్సయ్య, జన్నే రాములు, లక్కాకుల శ్రీనివాస్, మడిపల్లి మల్లయ్య, భాస్కర్, చీకట్ల శ్రీనివాస్, ఒర్రె చంద్రమౌళి, పుప్పాల నవీన్, ముస్త్యాల హరీశ్, పెద్దపాటి నరహరి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

రఘునాథపల్లి, మార్చి 27 : మానవ అక్రమ రవాణాపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని కంచనపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 13 నుంచి 20 ఏళ్ల వరకు పిల్లలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, వీవోఏలు జ్యోతి, వసంత, రాజేశ్వరీ, విజయ పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

- గానుగుపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిలపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్, మార్చి 27: మండలంలోని గానుగుపహాడ్-వడ్లకొండ సరిహద్దులో ఉన్న జనగామ - హుస్నాబాద్ ప్రధాన రహదారిపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి, చీటకోడూర్ వాగుపై ఉన్న వంతెన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిల నిర్మాణ పనులుసగంలోనే ఆగిపోయాయని తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని కోరారు. దీంతో అసెంబ్లీలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు నమోదు చేసుకున్నానని, నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేశ్



ఎన్నికైన బార్ అసోసియేషన్ కమిటీ బాధ్యులు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 27: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో గత నెలలో కోర్టు ప్రారంభం కాగా, గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కనకం రమేశ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి, సీనియర్ అడ్వకేట్ పసుటి రమేశ్ తెలిపారు. ఈనెల 17 నుంచి 21 వరకు నామినేషన్లు స్వీకరించగా, గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కనకం రమేశ్, ఉపాధ్యక్షుడిగా మునిగల రవీందర్, జనరల్ సెక్రటరీగా ఎస్‌కే షణ్ముకుమారి, సెక్రటరీగా మారపాక లక్ష్మణ్, లేడీ జాయింట్ సెక్రటరీగా పార్వతీశ్రీలత, కోశాధికారిగా టీఆర్ సాల్మన్‌రాజ్, లైబ్రరీ సెక్రటరీగా అమరోజు శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా గుర్రపు బాబు, తాడురి వనిత, సిద్దం శ్వేత ఎంపికయ్యారు.

భారీగా గుట్కా ప్యాకెట్లు పట్టివేత

జనగామ చౌరస్తా, మార్చి 27 : జిల్లా కేంద్రంలోని కుర్మవాడలో ఓ కిరాణా షాపు గోదాంలో నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్లను బుధవారం అర్ధరాత్రి వరంగల్ టాస్క్ ఫోర్స్ టీమ్‌తోపాటు జనగామ అర్బన్ పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ రూ.4లక్షల 89వేల 650 ఉంటుందని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ మధుసూదన్ తెలిపారు. జనగామలో నివసిస్తున్న రాజస్థాన్‌కు చెందిన నిందితుడు మాల్‌రామ్‌ను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు గమ్నారామ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

పోలీస్‌స్టేషన్‌కు తరలించిన మాజీ సర్పంచ్‌లు

పాలకుర్తి, మార్చి 27: పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి తరలివెళ్తారని పోలీసులు తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం 5గంటలకే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా తాజా మాజీ సర్పంచ్‌లు నకిర్త యాకయ్య, ధారవత్ బాలునాయక్, జర్పుల బాలునాయక్, కర్ణాకర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేను నెలలైనా సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్ట్ చేయడమేనా? అని మండిపడ్డారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ సర్కార్ వద్ద చిన్న చిన్న బిల్లులు చెల్లించేందుకు డబ్బులేవా? అని ప్రశ్నించారు. తక్షణమే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు జడ్పీ తాజా మాజీ ఫ్లోర్‌లీడర్ పుస్కూరి శ్రీనివాసరావు సంఘీభావం ప్రకటించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పీడీఎస్ బియ్యం, వాహనాన్ని చూపుతున్న పోలీసులు

దేవరుప్పుల, మార్చి 27: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై యూ సృజన్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ రాజు ట్రాలీ ఆటోలో 25 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా సింగరాజుపల్లిలో పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రవీందర్‌కు ఘన నివాళి

నివాళి అర్పిస్తున్న రాంబాబు

రఘునాథపల్లి, మార్చి 27: మండలంలోని కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమల పాటి రవీందర్ ఇటీవల మృతిచెందగా గురువారం చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రవీందర్ రైతాంగానికి చైర్మన్‌గా చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆస్తి పన్నుకు వన్ టైమ్ సెటిల్మెంట్ పథకం

జనగామ చౌరస్తా, మార్చి 27: జనగామ పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి (ఇంటి) పన్నుకు వన్ టైమ్ సెటిల్మెంట్ పథకం (ఓటీఎస్) అమల్లోకి వచ్చిందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఒకేసారి ఆస్తి పన్ను మొత్తం చెల్లించే వారికి వడ్డీపై 90శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆస్తి పన్ను వడ్డీ బకాయిలతో కలిపి చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆ డబ్బులు సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి గ్రామ పంచాయతీ పరిధిలో 35,615 దరఖాస్తులు రాగా, అందులో 3,713 మంది రుసుము చెల్లించినట్లు తెలిపారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీల పరిధిలో 22,553 దరఖాస్తులు రాగా, అందులో 1013 మంది ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించినట్లు వివరించారు. ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం ఉన్న రాయితీ మరో నాలుగు రోజుల్లో ముగియనుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నర్మెటలో అంగడి వేలం వాయిదా

నర్మెట, మార్చి 17: మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే అంగడి వేలం వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కందకట్ల శ్రీధర్ గురువారం తెలిపారు. 2025-26 సంవత్సరానికిగాను నిర్వహించిన వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాలేదు. దీంతో ఈనెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు తిరిగి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు ఏదైనా జాతీయ బ్యాంకులో పంచాయతీ కార్యదర్శి పేర రహదారికి రూ.80వేల డీడీ, తైబజారుకు రూ.30వేలు డీడీ తీసి టెండర్ షెడ్యూల్ పొందాలని సూచించారు.

తరిగొప్పలలో నేడు వేలం

తరిగొప్పుల, మార్చి 27: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే తైబజార్ (సంత) వేలం శుక్రవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-2026 సంవత్సరానికిగాను సంత వేలం పాటలో ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

కనకరాజ్‌కు ఘనంగా సన్మానం

కనకరాజ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

బచ్చన్నపేట, మార్చి 27 : మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన రచయిత, కళాకారుడు కనకరాజ్ డాక్టరేట్ అందుకున్నందున గురువారం గ్రామంలో మాజీ సర్పంచ్ ఖలీల్‌ఆజాం, మాజీ ఎంపీటీసీ గుర్రాల లలితా నర్సిరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ కనకరాజ్ రాబోయే రోజుల్లో మరింత ఎదగాలని కాంక్షించారు. పంచాయతీ కార్యదర్శి భానుచందర్, వివిధ పార్టీల నాయకులు నిమ్మ లింగారెడ్డి, గుర్రాల సిద్దారెడ్డి, మల్గ సిద్దులు, పుర్మ జోగారెడ్డి, బండారి అశోక్, గుండా సురేశ్, కరుణాకర్, మల్లయ్య, పోశయ్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా రమేశ్

మాచర్ల రమేశ్

జఫర్‌గఢ్, మార్చి 27 : సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం అనుబంధ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా మాచర్ల రమేశ్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జఫర్‌గఢ్ మండలం షాపల్లికి చెందిన మాచర్ల రమేశ్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం బలోపేతానికి రమేశ్ సేవలను మరింత వినియోగించుకునేందుకు జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు వారు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST OF DOCUMENTS

★I, **PITTA RAJU S/o VENKATAIAH,** H.No. 31-3-1212, Parimila Colony, Hanumakonda City & Dist-506370. T.G., Have Lost my Original Link Documents. While traveling from My Residency Parimila Colony to KUC 'X' Road, Hanumakonda. **1) Sale Deed No. 5075 of 2015, 2) GPA. Doc.No. 10134 of 2017, 3) Sale deed No. 25236 of 2018, SRO, Warangal (R.O).** If anybody found Please inform me. **Cell: 9849630305.**
NTW-6577

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఎల్ఆర్ఎస్ వినియోగించుకునేలా కృషి చేయాలి

బచ్చన్నపేట, మార్చి 27 : ప్రజలు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి సూచించారు. ఆమె గురువారం తమ్మడపల్లిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించారు. బచ్చన్నపేట గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో వంద శాతం ఎల్ఆర్ఎస్ కట్టుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్లాట్లు అమ్మిన వారు సైతం కొనుగోలు చేసిన వారికి ప్లాట్లు చూపించాలన్నారు. యజమానులు వాటికి హద్దులు పెట్టుకుని ఎల్ఆర్ఎస్ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించి, ప్లాట్ వద్ద ఫొటోలు దిగాలన్నారు. ఈ నెలాఖరు వరకు సమయం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో మల్లికార్జున్, సూపరింటెండెంట్ శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నర్సింహచారి, భరత్, ప్రశాంత్‌ఆచార్య, రేవతిగౌడ్, రుబీనాసుల్తానా, దేవీప్రసాద్, కర్ణాకర్, పంచాయతీ సిబ్బంది మంజుల, మురళీ, అశోక్, చక్రధర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

చిల్పూరు, మార్చి 27 : మండలంలోని వేంకటేశ్వరపల్లిలో 229 ప్రభుత్వ స్థలంలో పోలీస్‌స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న, డీసీపీ రాజమ